సాక్షి వరంగల్

ఆదివారం | 26 | ఫిబ్రవరి | 2023



ప్రీతి ఘటనపై ఆగని ఆందోళనలు

సీనియర్ విద్యార్థి వేధింపులు భరించలేక మెడికల్ విద్యార్థి ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటనపై ఆందోళనలు ఆగడం లేదు.

- 8లో▸



పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి

పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని అర్జున అవార్డు గ్రహీత, డబుల్ ఒలింపియన్ జేజే శోభ తల్లిదండ్రులకు సూచించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$37^0/20^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



వరంగల్ (పర్వతగిరి) : పదో తరగతిలో ఎస్సీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని డీఎస్‌సీడీఓ జీవరత్నం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్‌ను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు పరీక్షల్లో మెళకువలు, అత్యుత్తమ ఫలితాల విధివిధానాలపై బోధన చేశారు. అనంతరం విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు. హాస్టల్ మెనూ విధానం, ఆహారంపై విద్యార్థులతో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ వెంకట్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్ రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలి



నెక్కొండ: రాష్ట్ర ప్రభుత్వం గొల్ల, కురుమల అభివృద్ధికి గొర్రెలు, మేకలు పంపిణీ పథకంలో భాగంగా రెండో విడత పంపిణీ చేపట్టాలని గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. లింగయ్య డిమాండ్ చేశారు. రెడ్లవాడలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొదటి విడతలో పంపిణీ చేసిన లబ్ధిదారుల్లో చాలా వరకు గొర్లు చనిపోయి పెంపకందారులు నష్టపోయాన్నారు. దీంతో మిగిలిన లబ్ధిదారులకు నగదు బదిలీ ద్వారా వారి అకౌంట్లలో జమ చేయాలని కోరారు. వివిధ కారణాలతో మృత్యువాత పడుతున్న జీవాలకు బీమా సౌకర్యం అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా పశువైద్యాధికారి పి. శ్రీనివాస్, నెక్కొండ పశువైద్యాధికారి మమత, రెడ్లవాడ పీఏసీఎస్ చైర్మన్ జలగం సంపత్‌రావు, సర్పంచ్ రావుల శ్రీలత, ఉప సర్పంచ్ బర్ల వీరభద్రం, సంఘం నాయకులు బండి యాదగిరి, మేకల వెంకట్‌నారాయణ, దూదిమెట్ల యాదగిరి, సంగి గట్టయ్య, వేకల వంశీ, సుంకరబోయిన కుమారస్వామి, మేకల సురేందర్, వెంకన్న, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై చర్య తీసుకోవాలి



నర్సంపేట: ఖానాపురం మండలం నాజీతండాలో విధులు నిర్వహిస్తున్న ఆశవర్కర్‌పై వేధింపులకు పాల్పడిన సర్పంచ్ బాలకిషన్, శ్రీనివాస్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా నాయకురాలు ఎండీ.ఫరీదా డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశ వర్కర్‌ను శనివారం ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేధింపులకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆశకార్యకర్తలకు మహిళా సంఘాలు అండగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు వజ్జంతి విజయ, కోశాధికారి బిట్ర స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం




గీసుకొండ: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా సీనియర్ జడ్జి రాధాదేవి అన్నారు. శనివారం మండలంలోని కొనాయమాకులలోని ప్రగతి మహిళా సమాఖ్యలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. లాయర్‌ను పెట్టుకునే స్థోమత లేని పేద మహిళలకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా లాయర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఉపేందర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత, డీఆర్‌డీఓ ఎం. సంపత్‌రావు, అడిషనల్ డీఆర్‌డీఓ జి.శ్రీనివాస్, ఎంఎస్ అధ్యక్షుడు ఎం. కవిత, డీపీఎంలు అనిత, భవాని, దయాకర్, ఏపీఎం సురేశ్‌కుమార్, సీసీలు కోల శోభ, అశోక్, సుజాత, వీఓఏలు పాల్గొన్నారు.

ఓరు'పోరు'గల్లే టార్గెట్!

ఉమ్మడి వరంగల్ లక్ష్యంగా పార్టీల మోహరింపు

- వరుస పర్యటనలు, సభలు, సమావేశాల హోరు
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల పోటాపోటీ సభలు
- 27రోజుల్లో ఉమ్మడి జిల్లాకు మూడు సార్లు కేటీఆర్
- నియోజకవర్గాల్లోనే మంత్రులు, ఎమ్మెల్యేల మకాం



సాక్షిప్రతినిధి, వరంగల్: హైదరాబాద్ తర్వాత ద్వితీయ నగరంగా ఓరుగల్లును ఎంచుకుంటున్న పార్టీల నేతలు వరుస కట్టి పర్యటిస్తున్నారు. మాటల యుద్ధం ఎన్నికలను తలపిస్తోంది. ములుగు, భూపాలపల్లి మినహా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్‌లో గులాబీ పార్టీదే పైచేయి. కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై గెలిచిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బీఆర్ఎస్‌లో చేరగా.. ములుగు నియోజకవర్గం ఒక్కచోటే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ స్థానాలను పదిలపర్చుకునే పనిలో బీఆర్ఎస్ నిమగ్నం కాగా... ఉమ్మడి వరంగల్‌లో మరింత బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్, బీజేపీలు వ్యూహాత్మకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. దీంతో ఓరుగల్లు రాజకీయ పార్టీల పోరుగల్లుగా మారింది.

వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యం...


వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఉమ్మడి జిల్లాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్న ఆలోచనలో మూడు ప్రధాన పార్టీలు పనిచేస్తున్నాయి. నేతల హడావిడి పర్యటనలు, పార్టీల వ్యూహాలు రక్తి కట్టిస్తుండగా.. అధికారం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అగ్రనేతలు ఉమ్మడి జిల్లాకు వరుస కట్టడంతో రాజకీయ సందడి పతాకస్థాయికి చేరింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య పోటీ నువ్వా–నేనా అన్నట్లు కనిపించినా.. ములుగు, భూపాలపల్లి మినహా 10 చోట్ల కారు హవా కొనసాగింది. బీజేపీ దరిదాపుల్లో లేని పరిస్థితి. ఆ తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ దాదాపుగా గులాబీ పార్టీ హవానే కొనసాగింది. ఈ నేపథ్యంలో తమ స్థానాలను పదిలపర్చుకునేందుకు అధిష్టానం ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ముందుకు సాగుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పల్లెల్లో దూకుడు పెంచారు. ఇక.. హాథ్ సే హాథ్ జోడో యాత్రలతో కాంగ్రెస్ నేతలు ఉమ్మడి జిల్లాను చుట్టేస్తున్నారు. స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లతో కమలనాథులు కదనోత్సాహం చూపుతున్నారు. అన్ని పార్టీల లక్ష్యం వచ్చే అసెంబ్లీ ఎన్నికలే కావడంతో ప్రజల మధ్య ఉండేందుకు రకరకాల వ్యూహాలు పన్నుతున్నాయి.

అభివృద్ధి మంత్రం, యాత్రల తంత్రం...

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో ఉమ్మడి వరంగల్‌లో గంపగుత్త 12 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకునే దిశగా బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. నెల రోజుల కిందట సీఎం కేసీఆర్ మహబూబాబాద్ జిల్లాలో పర్యటించగా.. 27 రోజుల వ్యవధిలో మంత్రి కేటీఆర్, హరీశ్‌రావులు మూడేసి సార్లు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సారథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉండే ప్రయత్నం చేస్తున్నారు. జనవరి 31న కమలాపూర్, ఈ నెల 23న భూపాలపల్లిలో పర్యటించిన కేటీఆర్.. 27న వేలేరుకు వస్తున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ కేంద్రం, బీజేపీ నేతలపై ఘాటైన విమర్శలు చేశారు. వరుస ఓటమిలతో నైరాశ్యంలో ఉన్న కేడర్‌లో ఉత్సాహం నింపే ప్రయత్నంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ముమ్మరంగా కార్యక్రమాలు చేపడుతోంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఈ నెల 6న మేడారంలో ప్రారంభించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రను జోష్‌తో కొనసాగిస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లపై మాటల బాణాలను ఎక్కుపెట్టారు. బీజేపీ చీఫ్ బండి సంజయ్ చేపట్టిన ప్రజాసంగ్రామ యాత్రల తర్వాత ఉమ్మడి వరంగల్‌లో కమల దళం కదన కుతూహలంతో ఉంది. పార్లమెంట్, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లను నియమించడంతో పాటు స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లతో బీజేపీ దూసుకెళ్తోంది. బండి సంజయ్ శుక్ర, శనివారాల్లోనూ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో పర్యటించి మాటల తూటాలు పేల్చారు. ఆయా పార్టీల అగ్రనేతలు, నాయకుల మాటల తూటాలు, విమర్శలు.. ప్రతి విమర్శలతో ఉమ్మడి వరంగల్ రోజు రోజుకూ హీటెక్కుతోంది.

రేపటి నుంచి కొమ్మాల బ్రహ్మోత్సవాలు

- మార్చి 3న స్వామివారి కల్యాణోత్సవం
- 7 నుంచి జాతర ప్రారంభం



లక్ష్మీనర్సింహస్వామి మూలవిరాట్ (ఫైల్)

గీసుకొండ: మండలంలోని ప్రసిద్ధ కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ ఈఓ శేషగిరి, వంశ పారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు తెలిపారు. 27న అధ్యయనోత్సవం, 28న సుప్రభాతసేవ, బిందెతీర్థం, ప్రబోధకి, సేవాకాలం, మార్చి 1న నిత్యనిధి పరమపదోత్సవం, 2న అంకురారోపణం, రక్షాబంధనం, దీక్షా వస్త్రధారణ, అగ్నిప్రతిష్ఠ, 3న ఏకాదశి, నిత్యహోమం, ధ్వజారోహణం, బలిహరణం, భేరి పూజ, దేవతాహ్వానం, రాత్రి 10 గంటలకు అమ్మవార్లతో స్వామివారి కళ్యాణోత్సవం ఉంటుందన్నారు. 4న నిత్యనిధిహోమం, బలిహరణం, హనుమత్‌సేవ, వాహనసేవ, 5న నిత్యహోమం, బలిహరణం, సింహవాహన సేవ, 6న నిత్యనిధి, పర్వతబలి, సదస్యము, గరుడవాహన సేవ, 7న హోలీ పండుగ నాటి నుంచి జాతర ప్రారంభమవుతుందన్నారు. 11న స్వామివారి రథోత్సవం, 12న స్వామివారిని విశ్వనాథపురం గ్రామానికి పారువేటకు తీసుకుని వెళ్లడం, పుష్పయాగం, నాగవెల్లి, 13న శతఘటాభిషేకం, పండిత సన్మానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. ఉగాది పర్వదినం వరకు జాతర కొనసాగుతుందన్నారు. కాగా జాతరలో కొబ్బరికాయల అమ్మకానికి శుక్రవారం వేలంపాట నిర్వహించగా రూ.4.85 లక్షలకు ఖరారైందని ఈఓ పేర్కొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



రైతులకు మోటార్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

నర్సంపేట: రైతుల ఆర్థికాభివృద్ధికి అండగా ఉంటానని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం రైతులకు సబ్సిడీ మోటార్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అత్యుత్తమ నాణ్యత కలిగిన టెక్స్‌మో కంపెనీ మోటార్లను సబ్సిడీపై అందించడం జరిగిందన్నారు. ఈ ప్రాంత వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా చేసిన కృషికి సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. ఆపదలో అందుబాటులో లేకుండా ఎన్నికల సమయంలో మేలుకొని కపట ప్రేమలు చూపించే వారి పట్ల మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, టీఆర్ఎస్ నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, రైతు సమన్వయ సమితి బాధ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, హార్టీకల్చర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మెస్ వద్ద అపరిశుభ్ర వాతావరణం

సంస్థ అభివృద్ధికి పాటుపడాలి

రైతులే దేశానికి వెన్నెముక

- 10లో▸

దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా సంక్షేమాధికారి శారద
- దివ్యాంగుల ప్రజావాణిలో 18 అభ్యర్థనలు



అభ్యర్థనలు స్వీకరిస్తున్న అధికారులు

వరంగల్ రూరల్: ప్రతి నాల్గో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించే దివ్యాంగుల ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి శారద తెలిపారు. కలెక్టర్ డాక్టర్ బి.గోపి ఆదేశాల మేరకు శనివారం కలెక్టరేట్‌లో దివ్యాంగుల ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత బంధు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, వ్యక్తిగత రుణాల మంజూరు, అంత్యోదయ, దళితబంధు, సీనియర్ సిటిజన్‌తో పాటు, ఇతర సమస్యలపై 18 అభ్యర్థనలు వచ్చాయన్నారు. ఈ ప్రత్యేక ప్రజావాణిలో డీపీఎం పరమాత్మ, జిల్లా లీడ్ మేనేజర్ రాజు హవేలి, కమిషనర్ ఆఫ్ పోలీస్, జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఓ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి, డీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా ముఖ్యప్రణాళికాధికారి, ఎస్సీ కార్పొరేషన్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, మైనారిటీ శాఖ అధికారి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, రోడ్లు, భవనాలశాఖ ఎస్ఈ, డీపీఆర్ఓ, మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేట: నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడిన తెలంగాణలో ప్రజా సంక్షేమాన్ని సీఎం కేసీఆర్ విస్మరించారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు పట్టణంలోని సాయినగర్‌లో శుక్రవారం ప్రజాగోస బీజేపీ భరోసా శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ప్రకాశ్‌రెడ్డి హాజరు కాగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. సొంత రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు ఆపలేని కేసీఆర్ ఆప్‌కి బార్ కిసాన్ సర్కార్ ఎలా సాధిస్తుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, మహబూబాబాద్ పార్లమెంటు కో కన్వీనర్ సంతోష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్, జనరల్ సెక్రటరీ కొంపెల్లి రాజేందర్, ఉపాధ్యక్షుడు మల్యాల సాంబమూర్తి, నర్సంపేట మాజీ సర్పంచ్ చిలువేరు రజనిభారతి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నల్లబెల్లి సుదర్శన్, ప్రధాన కార్యదర్శి గుంటి వీరప్రకాశ్, పంజాల రాము, పెంచాల సతీష్, గూడూరు సందీప్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

నర్సంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా అభివృద్ధికి అనేక హామీలు ఇచ్చి విస్మరించారని, కనీసం జిల్లా కేంద్రాన్ని సైతం నిర్మించకపోవడం సిగ్గుచేటని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. ఈ మేరకు నర్సంపేట డివిజన్ సమావేశం పట్టణంలోని ఓంకార్ భవన్‌లో సీనియర్ నాయకుడు నాగెల్లి కొమురయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని 33 జిల్లాలుగా విభజించిన కేసీఆర్ ప్రభుత్వం జిల్లాకు జిల్లా కేంద్రాన్ని సైతం నిర్మించి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. జిల్లాలో బస చేసిన సీఎం కేసీఆర్ అనేక హామీలు ఇచ్చి ఆచరణలో విస్మరించారని, జిల్లాలో ఏ ఒక్కరికి కొత్తగా ఇంటి స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఈనెల 27న ఆందోళన ధర్నాలకు జిల్లా కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, పార్టీ డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, వంగల రాగసుధ, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, కేశెట్టి సదానందం, కలకోట్ల యాదగిరి, సింగతి మల్లికార్జున్, దామ సాంబయ్య, గాజుల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

శిల్ప కళా సంపద వెరీవెల్

ఖిలా వరంగల్: కాకతీయుల నిర్మాణ శైలి, శిల్ప కళా సంపద వేరి బ్యూటీఫుల్ అని బెల్జియం దేశస్తులు కొనియాడారు. శనివారం బెల్జియం దేశానికి చెందిన 35మంది పర్యాటకులు కోటను సందర్శించారు. మధ్యకోట ప్రాంగణంలోని శిల్పాలను తిలకించారు. కెమెరాలలో శిల్పాల అందాలను బంధించారు. కాకతీయుల విశిష్టత, కట్టడాల గురించి పర్యాటక శాఖ ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్ వివరించారు. వారి వెంట కేంద్ర పురావస్తుశాఖ కోర్డినేటర్ శ్రీకాంత్, అజయ్, సిబ్బంది ఉన్నారు.



సమష్టి కృషితోనే పట్టణ అభివృద్ధి

- ఎమ్మెల్యే అరూరి రమేష్
- వర్ధన్నపేట మున్సిపాలిటీ అంచనా బడ్జెట్ రూ.481.1లక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్

వర్ధన్నపేట: నూతనంగా ఏర్పడిన వర్ధన్నపేట మున్సిపాలిటీ సమష్టి కృషితోనే అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. శనివారం వర్ధన్నపేట ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఏర్పాటు చేసిన 4వ వార్షిక 2023–24 అంచనా బడ్జెట్ సాధారణ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ అధ్యక్షత వహించగా కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ రూ.30 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేసుకోవడం జరిగిందన్నారు. రూ. 29 కోట్లతో మిషన్ భగీరథ పెండింగ్ పనులు పూర్తి చేయడం జరుగుతున్నాయన్నారు.

ప్రణాళికా బద్ధంగా పనులు నిర్వహించుకోవాలి: కలెక్టర్ గోపి

పట్టణ అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులను చేసుకోవాలని కలెక్టర్ గోపి సూచించారు. ఏ పనులు అత్యవసరం అనేది ముందుగా గుర్తించాలన్నారు. పట్టణంలో అండర్ డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ ఆదాయం రూ.481.1లక్షలు, వ్యయం రూ. 479.23 లక్షలు ఉండగా మిగులు అంచనా రూ. 1.87లక్షల ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీందర్ చదివి వినిపించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, మునిసపల్ కమిషనర్ గొడిశాల రవీందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

వర్ధన్నపేట పట్టణంలో రూ. 8 కోట్ల నిధులతో సెంట్రల్ లైటింగ్, డివైడర్‌లను శనివారం కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి అరూరి రమేష్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వంలో కష్టపడి పని చేస్తామన్నారు. వారిలాగా పాదయాత్ర, కార్నర్ మీటింగ్‌లో కార్లలో కూర్చుని తాము పని చేయమని ప్రజలతో మమేకమై పనులు చేస్తున్నామన్నారు.

వరంగల్ బార్ అసోసియేషన్ సమావేశం



బార్ అసోసియేషన్ ఈసీ సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌మోహన్

వరంగల్ లీగల్: వరంగల్, హనుమకొండ కోర్టు ప్రాంగణంలోని వరంగల్‌బార్ అసోసియేషన్ భవనంలో శనివారం బార్ ఈసీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా తెలంగాణ కౌన్సిల్ మెంబర్స్ కొల్లి సత్యనారాయణ, ధన్వాడ మధుసూదన్‌రావు హాజరయ్యారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రత్యేక బార్ కార్యవర్గ ఏర్పాటు విషయంపై ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అంబరీష్, జీవన్‌గౌడ్, గుడిమల్ల రవికుమార్, సూర్యారావు, రమేష్ అభిప్రాయాలను సేకరించారు. బార్ కౌన్సిల్ నుంచి ఆమోదం విషయాన్ని వరంగల్ బార్ అసోసియేషన్‌కి మాత్రమే సమాచారం అందజేస్తామని అతిథులు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలుకుర్తి ఆనంద్‌మోహన్ మాట్లాడుతూ న్యాయవాదులందరూ ఏమైన అభిప్రాయాలు తెలియ పర్చాలనుకుంటే రాత పూర్వకంగా వరంగల్ బార్‌కు అందజేయాలని తెలిపారు.

జయముఖిలో గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లను అందిస్తున్న అశోక్ కుమార్

నర్సంపేట రూరల్: నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం గ్రామశివారులోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2020– 2023 సంవత్సరాలకు సంబంధించి ఎంబీఏ, బీటెక్, ఎంటెక్ విద్యార్థులు సుమారు 600 మంది గ్రాడ్యుయేషన్ డేలో సర్టిఫికెట్లను పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్యాపిజెమిని సీనియర్ మేనేజర్, బిజినెస్ ట్రాన్స్‌ఫార్మేషన్ అశోక్ కుమార్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు తప్పనిసరి



నట్టల నివారణ మందు వేస్తున్న శ్రీనివాస్

నెక్కొండ: జీవాలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు వేయించాలని ఇన్‌చార్జ్ జిల్లా పశువైద్యాధికారి పి. శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రెడ్లవాడ గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 20లక్షల నుంచి రూ.కోటి వరకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్ మిషన్ (ఎన్ఎల్ఎం) జీవాల పెంపకందారులకు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న పెంపకందారులు 50 శాతం సబ్సిడీతో అందించే పథకాన్ని లబ్ధిపొందవచ్చన్నారు. నట్టలతో జీవాలకు ప్రమాదం ఉందని, అందుకు సంవత్సరానికి 4 సార్లు నట్టల నివారణ మందును ఉచితంగా అందిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 6,95,953 జీవాలకు నట్టల నివారణ మందు అందించాలన్న లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకు 3,14,500 జీవాలకు నట్టల నివారణ మందు అందించామన్నారు. మరో మూడు రోజుల్లో మిగతా జీవాలకు అందించి, లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. అనంతరం జీవాలకు ఆయన నట్టల నివారణ మందును తాగించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ పశువైద్యాధికారి మమత, రెడ్లవాడ పీఏసీఎస్ చైర్మన్ జలగం సంపత్‌రావు, గ్రామ సర్పంచ్ రావుల శ్రీలత, ఉప సర్పంచ్ బర్ల వీరభద్రం, వీఎల్ఓ యాదగిరి, ఎల్ఎస్ఏ మొగిలి, అటెండర్ కుమారస్వామి, జీవాల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

జీడబ్ల్యూఎంసీ కొత్త పరిపాలన భవనం



ప్రారంభమైన నూతన పరిపాలన భవన నిర్మాణ పనులు

వరంగల్ అర్బన్ : వరంగల్ మహా నగర పాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) నూతన పరిపాలన భవన నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. అధునాతన ప్రమాణాలతో బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని మెప్మా కార్యాలయానికి పక్కన ఈ భవనం నిర్మాణం కానుంది. ఆరు నెలల కిందట రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. జీప్లస్5లో భారీ భవనం ప్రణాళికలో తొలుత జీప్లస్2 భవనాన్ని నిర్మించనున్నారు. తదుపరి మరో మూడు అంతస్తులు నిర్మించనున్నారు. ఇందుకు రూ.20.50కోట్లను వ్యయం చేస్తున్నారు. భవనాన్ని రాష్ట్ర టౌన్అండ్‌కంట్రీ ప్లానింగ్ విభాగం నిపుణుల సూచనలు, అనుమతి తీసుకొని నిర్మాణం చేస్తున్నట్లు బల్దియా ఇంజనీర్లు పేర్కొన్నారు.

మోసానికి పాల్పడిన ముగ్గురిపై కేసు

కాజీపేట: దాదాపు రెండు దశాబ్దాల కింద అమ్మిన ప్లాటును మరొకరికి విక్రయించి మోసానికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు కాజీపేట ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం 61వ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీలో ఓ ప్లాట్‌ను అందె యాదయ్య అనే వ్యక్తి 2003లో కొనుగోలు చేశాడు. అదే ప్లాట్‌ను భూక్యా యమున అనే మహిళ ఇటీవల విక్రయించి డబ్బులు వసూలు చేసింది. మొదట కొనుగోలు చేసిన యాదయ్య ఫిర్యాదు మేరకు యమునతోపాటు కుమారులు అనిల్‌కుమార్, సంపత్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి

- అర్జున అవార్డు గ్రహీత జేజే శోభ
- త్వరలో క్రీడా క్యాలెండర్
- ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్



పరుగెత్తుతున్న పురుషులు

వరంగల్ స్పోర్ట్స్: పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని అర్జున అవార్డు గ్రహీత, డబుల్ ఒలింపియన్ జేజే శోభ తల్లిదండ్రులకు సూచించారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 9వ తెలంగాణ యూత్ అండ్ 400 మెన్ (ఆల్ ఏజ్ గ్రూప్స్) అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. హనుమకొండ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న పోటీలకు ముఖ్య అతిథిగా జేజే శోభ హాజరై మాట్లాడారు. గతంలో కంటే క్రీడా వసతులు మెరుగుపడ్డాయని, అయితే వసతుల కల్పనలో మరింత ఆధునీకరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడాకారులు మొబైల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, కోచ్ పర్యవేక్షణలో పట్టుదల, క్రమశిక్షణతో క్రీడల్లో సాధన చేయాలని అన్నారు. మరో అతిథి ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రత్యేక క్రీడాపాలసీ అమలుకు ప్రణాళిక సిద్ధం చేశారని అన్నారు. నగరంలో క్రీడాభివృద్ధికి ప్రత్యేక క్రీడా క్యాలెండర్‌ను రూపొందించి అమలు చేయనున్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.సారంగపాణి మాట్లాడుతూ 33 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు, 100 వరకు టెక్నికల్ అఫీషియల్స్, రెఫరీలు హాజరయ్యారని తెలిపారు. 28 ఈవెంట్లలో జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు మార్చి 10 నుంచి 12 వరకు కర్ణాటకలోని ఉడిపిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బ్యాడ్మింటన్ సంఘం జిల్లా కార్యదర్శి పి.రమేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ సంఘం బాధ్యులు మూగల కుమార్‌యాదవ్, లెక్కల రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఐలి చంద్రమోహన్ గౌడ్, అంతర్జాతీయ అథ్లెట్ నాగమణి, టెక్నికల్ అఫీషియల్స్ శ్రీమన్నారాయణ, నాగరాజు, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో క్రీడా వేడుకలు

జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఏర్పాట్లలో నిర్వాహకులు పూర్తిగా విఫలమయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించే వేదిక వద్ద ప్రాథమిక వైద్యచికిత్స అందించేందుకు అందుబాటులో వైద్య సిబ్బందితో పాటు అంబులెన్స్‌ను సైతం స్టేడియం వద్ద ఉంచాలి. మండుటెండలో క్రీడాకారులు భోజనం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 8 గంటలకే అథ్లెటిక్స్‌లో వివిధ ఈవెంట్లలో పోటీలను నిర్వహించిన అసోసియేషన్ బాధ్యులు అధికారికంగా ప్రారంభోత్సవ వేడుకలు 10 గంటలకు నిర్ణయించారు. వేడుకలకు అర్జున అవార్డు గ్రహీత, డబుల్ ఒలింపియన్ జేజే శోభ ముఖ్య అతిథిగా హాజరు కాగా మరో అతిథి ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కోసం సుమారు మూడున్నర గంటల పాటు ఎదురు చూశారు. అప్పటికే అనేక ఈవెంట్లలో పాల్గొన్న క్రీడాకారులు అలసిపోయారు.



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్



హైజంప్ చేస్తున్న యువతి



జేజే శోభను సత్కరిస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

ప్రీతి ఘటనపై ఆగని ఆందోళనలు

- కేఎంసీ గేటు ఎదుట గిరిజన సంఘాల ఆందోళన



కేఎంసీ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

ఎంజీఎం : సీనియర్ విద్యార్థి వేధింపులు భరించలేక మెడికల్ విద్యార్థి ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటనపై ఆందోళనలు ఆగడం లేదు. శుక్రవారం పోలీస్ కమిషనర్ నిందితుడు సైఫ్‌ను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం ఖమ్మం జైలుకు తరలించినప్పటికీ గిరిజన సంఘాల నాయకులు తమ ఆందోళనలు ఆపడం లేదు. ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారణమైన సైఫ్‌ను వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కాకతీయ మెడికల్ కళాశాల గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంజీఎం సూపరింటెండెంట్, కేఎంసీ ప్రిన్సిపాల్, హెచ్ఓడీలను వెంటనే సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘాల నాయకులు ఆందోళనతో పెద్దఎత్తున ట్రాఫిక్‌జామ్ కాగా ఇంతేజార్‌గంజ్ సీఐ మల్లేశ్, మట్టెవాడ ఎస్‌హెచ్ఓ శంకర్ వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రామారావు కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంట గ్రామానికి చెందిన చెరుకు శోభన్(20) వరంగల్‌లోని తన స్నేహితుడిని కలిసేందుకు వెళ్తుండగా ఆక్టీవా బైక్ వేగంగా వెళ్తూ బ్రేక్ వేయడంతో కింద పడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి చెరుకు మల్లయ్యకు ముగ్గురు కుమారులు కాగా చిన్న కుమారుడు శోభన్. ఇతను హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం సొంత గ్రామంలో ఇంటి వద్ద ఉప్పలమ్మ పండుగకు వచ్చాడు. ఫ్రెండ్‌ను కలిసేందుకు వరంగల్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఇల్లంద గ్రామశివారులోని లక్ష్మిగార్డెన్ ఎదుట వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి మృతి చెందాడు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

మండలంలోని ఇల్లంద శివారులోని లక్ష్మిగార్డెన్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. రాయపర్తి నుంచి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో వరంగల్ వెళ్తుండగా, వరంగల్ నుంచి తొర్రూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో రోడ్డు ప్రక్కకు వెళ్లి నిలిచిపోయింది. ఆటోలో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు గాయాలు కావడంతో స్థానికులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

జువైనల్ హోంకు ఏడుగురు బాలలు

కాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఏడుగురు బాలురపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జువైనల్ మేజిస్ట్రేట్ వారిని రెండు రోజుల పాటు అబ్జర్వేషన్ కోసం జువైనల్ హోంకు పంపించినట్లు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. కాజీపేటలో వాహనాల తనిఖీలు చేపట్టగా పిల్లలు వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. వారిపై కోర్టులో ఛార్జ్‌షీట్ వేయడంతో పాటు పిల్లలకు వాహనాలను ఇచ్చిన యజమానులకు జరిమానాలు విధించినట్లు సీఐ వివరించారు.

ముసలమ్మకుంటలో గల్లంతైన విద్యార్థి మృతి

- శాంతినగర్‌లో విషాదం



అలీం మృతదేహాన్ని తీసుకొస్తున్న పోలీసులు

వరంగల్: వరంగల్ ఏనుమాముల సమీపంలోని ముసలమ్మకుంటలో చేపలవేట కోసం వెళ్లి గల్లంతైన విద్యార్థి అలీం(15) మృతదేహం శనివారం ఉదయం చెరువులో తేలిందని ఎస్సై పోగుల శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై శాంతినగర్ వాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని 20వ డివిజన్ శాంతినగర్‌కు చెందిన సాజిదా, అఫ్జల్‌లకు ఇద్దరు కుమారులు అలీం, అజీం ఉన్నారు. ఎల్‌బీనగర్‌లోని మసూం అలీ పాఠశాలలో అలీం 9వ తరగతి చదువుతున్నాడు. అలీం శాంతినగర్‌కు చెందిన ముగ్గురు, చార్‌బౌళికి చెందిన మరో మిత్రునితో మొత్తం ఐదుగురు ముసలమ్మకుంట వద్దకు వెళ్లారు. గుంతల్లో గాలం వేస్తున్న అలీంను ఈత కొట్టేందుకు లోపలికి రమ్మని స్నేహితులు పిలవగా తనకు ఈత రాదని చెప్పినప్పటికీ చివరకు కుంటలోకి దిగాడు. దిగుతున్న క్రమంలో అలీంతో పాటు మరో బాలుడు మునిగి పోయారు. పక్కనే ఉన్న ఒకరు వచ్చి మునిగిపోతున్న వారిని కాపాడే ప్రయత్నం చేయగా ఒకరిని గట్టుపైకి రాగా అప్పటికే అలీం మాత్రం మునిగిపోయినట్లు తెలిసింది. దీంతో అక్కడ నుంచి అలీం స్నేహితులు భయంతో ఇళ్లకు వెళ్లగా ఒకరు మునిగిపోయారన్న విషయం వాట్సప్‌లో వైరల్ అయింది. ఈ మేరకు ఏనుమాముల పోలీసులు ముసలమ్మకుంట వద్దకు వెళ్లి గాలింపులు చేపట్టినప్పటికీ రాత్రి కావడంతో వాయిదా వేశారు. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కుంటలో అలీం మృతదేహం తేలడంతో రెస్క్యూ టీం ఒడ్డుకు తీసుకొచ్చారు. శవపంచనామా నిర్వహించి ఎంజీఎం ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తల్లిదండ్రులు అప్పగించారు. అలీం తల్లిదండ్రులు నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో శాంతినగర్‌లో విషాదం అలుముకుంది.

స్కూటర్ నంబర్‌తో గుర్తింపు

ముసలమ్మకుంటలో విద్యార్థి గల్లంతైన ప్రచారం జరిగినప్పటికి ఎవరూ అన్న విషయం తేలలేదు. సంఘటనా స్థలం వద్ద విద్యార్థులు తెచ్చిన స్కూటర్‌ను వదిలిపెట్టి వెళ్లడంతో దాని నంబర్‌ను ట్రాఫిక్ పోలీస్ యాప్‌లో చెక్ చేశారు. ఈ స్కూటర్‌పై గత అక్టోబర్‌లో ట్రాఫిక్ చలాన్లు ఉండడంతో దానిపై ప్రయాణిస్తున్న వారిని గుర్తించి నిర్ధారణకు వచ్చి సమాచారం అందించడంతో శాంతినగర్‌కు చెందిన అలీంగా గుర్తించారు. వేసవి సెలవులు వస్తున్న దృష్ట్యా చెరువులు, కాల్వల వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు గస్తీ నిర్వహించాలని నగరవాసులు పోలీసు, రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.

అదుపుతప్పి టాటాఏస్ బోల్తా







ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు



ప్రమాద స్థలంలో గుమిగూడిన జనం

- 14 మందికి తీవ్ర గాయాలు
- తప్పిన పెనుప్రమాదం
- 12 మంది హైదరాబాద్ యూసుఫ్‌గూడ వాసులు

ఖానాపురం/నర్సంపేట: అదుపుతప్పి టాటాఏస్ ట్రాలీ వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో 14మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రం శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ యూసుఫ్‌గూడకు చెందిన 12 మంది వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి గృహప్రవేశ కార్యక్రమానికి శనివారం ఉదయం వచ్చారు. కార్యక్రమం ముగిశాక మైసంపల్లికి చెందిన మరో ఇద్దరితో కలిసి మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల పరిధిలోని పర్యాటక ప్రాంతమైన భీమునిపాదానికి వెళ్లారు. సాయంత్రం వరకు పర్యాటక ప్రాంతం వద్ద సంతోషంగా గడిపారు. తిరుగు ప్రయాణంలో టాటాఏస్‌లో మైసంపల్లికి వస్తుండగా ఖానాపురం శివారులో పాకాలవాగు బ్రిడ్జి సమీపంలో వాహనం ముందు టైర్ పంక్చర్ అయి అదుపు తప్పి కల్వర్టుకు ఢీకొని రోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మైసంపల్లికి చెందిన జెర్రిపోతుల చింటు, జెరిపోతుల వంశీ, యూసుఫ్‌గూడకు చెందిన మట్టాడ పవన్, పోలు, సీహెచ్.వెంకట్, ముదసాని చరణ్, పావని, వెంకటేశ్వర్‌రావు, మౌనిక, చిన్నారి టోని, సాయి, నిరాజ్, అవినాష్, రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వాహనంలో ఇరుక్కుపోయిన బాధితులను బయటకు తీశారు. స్థానికులు 108కు సమాచారం అందించగా సకాలంలో రాలేదు. దీంతో ఆటోలో స్థానికులతో పాటు పోలీసులు నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంటనే వైద్యులు ప్రాథమిక వైద్య చికిత్సలు అందించారు. రోడ్డుపైనే పడడంతో పెను ప్రమాదం తప్పింది.

14మందిని కాపాడిన కల్వర్టు పిల్లర్

ఒక కల్వర్టు పిల్లర్ 14మందిని కాపాడింది. బ్రిడ్జి సమీపంలో ఉన్న కల్వర్టు పిల్లర్‌కు 14 మందితో ప్రయాణిస్తున్న టాటా ఏస్ ముందు ఢీకొనడంతో లోయలో పడకుండా హైవేపై పల్టీ కొట్టింది. దీంతో ఒక్క పిల్లర్ 14 మందిని కాపాడినట్లయింది.

గంట అయినా 108 వాహనం రాలేదు

ప్రమాదం 5.15 గంటలకు జరగగా గాయాలైన వారిని చికిత్స కోసం తరలించేందుకు సమీప ప్రజలు 108కు కాల్ చేసినా గంట వరకు సంఘటన స్థలానికి చేరుకోలేదు. పోలీసులు ఆటోల ద్వారా నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాలు బలికొనే కల్వర్టుకు ఉన్న పిల్లర్ పెద్ద ప్రమాదాన్ని అడ్డుకుంటే గాయాలైన వారిని 108 వాహన సిబ్బంది మాత్రం నిర్లక్ష్యం చేశారు.

వేలేరు సభా స్థలి పరిశీలన

- పలు సూచనలు చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ధర్మసాగర్(వేలేరు): వేలేరు మండలం సోడషపల్లి గ్రామశివారులో ఈ నెల 27న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేయనున్న బహిరంగ సభాస్థలాన్ని శనివారం సాయంత్రం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమం, బహిరంగ సభ, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అధికారులకు, బీఆర్ఎస్ నాయకులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్ కూడా సభాస్థలిని పరిశీలించారు. సోడషపల్లి శివారులో ఏనుమాముల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మార్కెట్ సబ్ యార్డు పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్ కుమార్, సీతఈ సుధాకర్‌రెడ్డి, డీఎల్‌పీఓ రవిబాబు, ఈఈ పీఆర్ శంకరయ్య, కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జె డ్పీటీసీ చాడ సరిత, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుస్‌రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, సర్పంచ్ కొట్టె రాజేష్ పాల్గొన్నారు.

అధికార పార్టీ సర్పంచ్ వేధింపులు..

- ఆశ వర్కర్ ఆత్మహత్యాయత్నం
- వేధింపులకు గురి చేయలేదన్న సర్పంచ్



చికిత్స పొందుతున్న నీల

ఖానాపురం: అధికార పార్టీ సర్పంచ్ వేధింపులు తట్టుకోలేక ఓ ఆశ కార్యకర్త శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధిత మహిళ కునోతు నీల తెలిపిన వివరాల ప్రకారం.. నాజీతండాకు చెందిన నీల ఆశ కార్యకర్తగా 18 ఏళ్లుగా బోటిమీదితండా, నాజీ తండా పరిధిలో విధులు నిర్వహిస్తోంది. కొద్ది నెలల క్రితం ఆశ కార్యకర్త, హెల్త్ సూపర్‌వైజర్ల పనితీరు సరిగా లేదని, వారిని తొలగించాలని గ్రామపంచాయతీలో తీర్మానం చేశారు. ఇదే సమయంలో మండల సభలో సర్పంచ్ బాదావత్ బాలకిషన్ ఆశ కార్యకర్తపై ఆరోపణలు చేస్తూ అధికారులను నిలదీశారు. ఈ మేరకు ఇటీవల డిప్యూటీ డీఎంహెచ్ఓ విచారణకు రావడంతో ఆ సమయంలో సర్పంచ్ చంపుతానంటూ ఆశ కార్యకర్తను బెదిరిస్తుండగా ఓ యువకుడు వీడియో తీశాడు. ఆ సెల్‌ఫోన్ స్థానిక ఎస్సై వద్దకు చేరింది. ఆయన పది రోజుల పాటు తనవద్దే ఉంచుకోగా ఆశ కార్యకర్త వెళ్లి ఆ సెల్‌ఫోన్ ఇవ్వమని అడగడంతో అదే సమయంలో సర్పంచ్ వచ్చి ఫోన్ తీసుకుని వీడియోను డిలీట్ చేయించి వెళ్లిపోయాడు. ఇలా వీరి మధ్య వివాదం మరింత పెరిగింది. ఈ క్రమంలో కంటివెలుగు శిబిరాల విధులకు నీలను రానీయకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చి అడ్డుకోవడం, చంపుతానని బెదిరిస్తున్నాడు. నాలుగు రోజులుగా వేధింపులు ఎక్కువ కావడంతో తట్టుకోలేక శనివారం పురుగుల మందు తాగింది. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సర్పంచ్ బాలకిషన్‌తో పాటు బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌లు తనను ఇబ్బంది పెడుతున్నట్లు నీల ఆరోపించింది. విధులకు వెళ్తుండగా మధ్యలో అడ్డుకుని చంపుతానని బెదిరిస్తూ శారీరక వేధింపులకు గురిచేస్తున్నాడని తెలిపింది. ఆశ కార్యకర్తను చంపాలని, చంపిన తర్వాత చిన్న కేసుతో బయటకు వస్తానని తన ముందే ఫోన్‌లో మాట్లాడుతూ బెదిరించేవాడని వాపోయింది. దీనిపై సర్పంచ్ బాలకిషన్ మాట్లాడుతూ ఆశ కార్యకర్త నీల విధులు సరిగా నిర్వహించడం లేదని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు చేయించకుండా ప్రైవేట్‌కు పంపుతూ ప్రజల వద్ద డబ్బులు తీసుకుంటుందని తెలిపారు. ఆమెను ఎలాంటి వేధింపులకు గురిచేయలేదని పేర్కొన్నారు. ఆమె డబ్బులు వసూలు చేసిన వివరాలన్నీ తన వద్ద ఉన్నాయని చెప్పారు.

నా చావుకు ఎంపీటీసీ భర్తే కారణం..

- రియల్టర్ విజయ్‌కుమార్ కూడా
- న్యాయం చేస్తానని నమ్మించి మోసం చేశారు
- ఆయన వల్ల ఉద్యోగం కోల్పోయా.. ఆర్థికంగా చితికిపోయా..
- వైరల్ అవుతున్న వీడియో



పురుగుమందు డబ్బాతో సిద్దులు

రఘునాథపల్లి : నాకు న్యాయం చేస్తానని నమ్మించి మోసం చేసిన శివాజీనగర్ ఎంపీటీసీ భర్త బొల్లపల్లి వెంకటస్వామి నా చావుకు కారణమని కోమళ్ల గ్రామానికి చెందిన మంద సిద్దులు చేతిలో పురుగుల మందు డబ్బా పట్టుకొని సెల్ఫీ తీసుకున్న వీడియో శనివారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అశ్వరావుపల్లి శివారులోని సర్వే నెంబర్ 324లో తమ కుటుంబానికి 22 గంటల భూమి ఉందని (టోల్ గేట్, మండల కార్యాలయం మధ్య) కబ్జాలో మాత్రం మంద కొంరయ్య, మంద చంద్రయ్య, తూంకుంట్ల రాంరెడ్డిలు ఉన్నారని వీడియోలో సిద్దులు పేర్కొన్నారు. మా భూమి మాకు ఇప్పిస్తానని తమ గ్రామానికి చెందిన ఎంపీటీసీ భర్త వెంకటస్వామి తనను సంప్రదించాడని, స్వతహాగా లాయర్ అయిన వెంకటస్వామి, ఆయన పేరిట ఎకరం భూమి పట్టా చేయించుకొని నాకు అన్యాయం చేశాడన్నారు. 14 నెలల పాటు కేసు పేరిట లింగంపల్లిలో ఉంటున్న తనను కోమళ్లకు పిలిపించాడన్నారు. దీంతో రవాణా, ఇతర ఖర్చులతో ఆర్థికంగా చితికిపోయినట్టే పేర్కొన్నారు. తరచూ సెలవులు పెట్టి రావడంతో ప్రైవేట్ ఉద్యోగం పోయిందని, ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని, నా చావుకు బొల్లపల్లి వెంకటస్వామి, రియల్టర్ విజయ్‌కుమార్ కారణమని చెప్పాడు. ఈ వీడియో మండలంలోని వివిధ సామాజిక మాధ్యమ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోపై వెంకటస్వామిని వివరణ కోరగా తాను పెద్దమనిషిగా వ్యవహరించానే కాని, అతనికి ఎలాంటి అన్యాయం చేయలేదని తెలిపారు. తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్న సిద్దులుపై శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

ప్లాట్స్ అమ్మబడును

■ పరకాలలోని గంద్రవాడ శివాలయం గుడి దగ్గర 1125 చ॥గ॥ల (4x300 చ॥గ॥లు) ఈస్ట్ ఫేస్ గల రెసిడెన్షియల్ ప్లాట్స్ అమ్మబడును. సెల్: 9848058860, 9000571119. [W-1144046]

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26759]

■ భీమారం మేన్‌రోడ్ Reliance Trends షాపింగ్ మాల్ ప్రక్క సందులో మేన్‌రోడ్ నుండి 3 ని॥ దూరంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి నివాస్ నందు 2 BHK & 3BHK Flats అమ్మకానికి కలవు. Good Ventilation. Ready to occupy. సంప్ర॥ 9849101554 [WA-2919]

HOUSE FOR SALE

■ వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-775834]

■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సంప్రదించండి: సెల్: 7660008666, 8309035091. [WA-26760]

■ ఉర్సు గుట్ట నుండి కాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent House అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26761]

■ వరంగల్ రంగశాయిపేట శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26748]

PLOT FOR SALE

■ మామునూర్‌లో అభివృద్ధి చేసిన కుడా లేఅవుట్ 263, 228, 200 గజాలు ప్లాట్లకై సంప్రదించండి: సెల్: 9032111600. [W-775782]

■ సుబేదారి నుండి పింగిలి కాలేజి వెళ్ళే 60 ఫీట్ రోడ్డు గల మండల ప్రజా పరిషత్ ఎదురుగా ఉన్న 680 చ॥గ॥ నార్త్ ఫేసింగ్ ప్లాటు కమర్షియల్ ప్లాటు హాస్పిటల్స్, హోటల్స్‌కి అనుకూలమైనది. అమ్మకం. 9985777792. [W-775784]

■ వరంగల్ ములుగురోడ్ నుంచి 1 కిలోమీటర్ దూరంలో అయ్యప్పస్వామి గుడి దగ్గరలో ఉన్న ఆకృతి Enclave లో 275 చ॥గ॥ లేఅవుట్ ప్లాట్ అమ్మబడును. సంప్ర॥ 9849101554. [WA-2929]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ హన్మకొండ, గోపాల్‌పూర్ కల్లు మండువ దగ్గరలో విద్యాధరి స్కూల్ ప్రక్కన EAST ఫేసింగ్ 110 ఫీట్లు మేన్‌రోడ్డుకు సెకండ్ బిట్ గల 1000 చ॥గ॥ ప్లాట్ అమ్మబడును. సంప్ర॥ 9849101554. [WA-2928]

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. బైబ్యాక్, కాంట్రాక్ట్, వారికి ఆర్థిక సహాయం చేయబడును. సెల్: 8331878582, హన్మకొండ. [WA-6500]

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్‌ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్ర: 94630 26237 [T-P1751]

BUSINESS OFFER

■ Invest small amount in trading company and get daily returns : 8317689472 [H-787446]

■ పర్మినెంట్ బిజినెస్ వన్‌టైమ్ పెట్టుబడిలోనే లైఫ్ టైమ్ మాస్టర్ ఫ్రాంచైజ్ లీడింగ్ మల్టీ బిజినెస్ డైలీ సపోర్టు+ట్రైనింగ్+మంచి భవిష్యత్తు + ఆదాయం +15 సం॥ అనుభవం. ఫోన్ 9908743603 [HA-5600]

■ Wanted Franchise / Agents in Hyderabad & All Telangana & All Andhra Pradesh. New Maruthi Couriers and Cargo Services Call: 9010459283 [H-793615]

WANTED

■ Wanted Male/ Female Nurses, Front Office Executives, Lift Boys, Floor Managers, Personal Assistant, Audit Assistant, Computer Operators, Drivers, PRO's. Typist, AC Technician, MBA Finance, HR Cont: 7337313271, 9949499959. [WA-12497]

■ హన్మకొండ, వరంగల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥- 12గం॥ డ్యూటీలు కలవు. జీతం: 12000-15000. సంప్ర॥ 8688072125. [W-775835]

■ RO Water Purifier Sales కొరకు స్టాల్ బాయ్స్ అర్జెంటుగా కావలెను. సంప్ర॥ విజయ గణపతి ఏజన్సీస్, పోచమ్మమైదాన్, వరంగల్. సెల్: 9849675949. [W-775832]

■ ప్రముఖ కార్పొరేట్ finance సంస్థలో పనిచేయడానికి అనుభవం కలిగిన టీం లీడర్స్ & కలెక్షన్‌బాయ్స్ కావలెను. జీతం: 15000 to 20000/- వేల వరకు ఇంటర్వ్యూ 6th Febన జరుగును. సంప్ర॥ 8897653065. [WA-2927]

■ Computer Operators / Pharmacists / Supervisors & GNM Nurses required for Guardian Hospital - Mulugu "X" Road, Warangal. Cont: time 12 to 2. [WA-0195]

■ వరంగల్ స్టేషన్‌రోడ్‌కు గల విష్ణు లాడ్జిలో పని చేయుటకు మేనేజర్స్‌గా, సూపర్‌వైజర్స్‌గా 12 గం॥ డ్యూటీ సాలరీ. 10 వేలు ఇవ్వబడును. రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు, RTC కండక్టర్స్, మొ॥వారికి ప్రాధాన్యత. 9391864657 [W-775819]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోస్ట్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5. జీతం: 18 - 25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]

■ Banking Collections Field Executive Salary: 15,000 + Good Incentive (2 Wheeler Must) Address: 6-3-191/C/1, Fortune 9, 2nd Floor, Opposite Yashodha Hospital Road, Somaji guda, Hyderabad - 500082 Contact Numbers: 8220640613/ 7305045987 [HA-9777]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15 వేలు ఆపైన వరకు జీతం. మరిన్ని వివరాలకు సంప్ర: 93919 94780. [L-514]

PLOT FOR SALE

■ హన్మకొండలోని రెడ్డిపురం కెనాలు కట్ట దగ్గర 374 గజాల ప్లాటు అమ్మడానికి ఉంది దగ్గరలో వైర్లు ఉన్నందున కేవలం గజానికి 12,000 రూ॥లు మాత్రమే. సెల్: 9246890851. [W-775786]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.